లక్ష్యాన్ని సాధించే దిశగా..

చదువుపై దృష్టి సారించాలి

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి
విద్యార్థులకు ప్రేరణ, శిక్షణా కార్యక్రమాలపై తరగతులు

- మహిళా సంఘాల ఆర్థిక పురోగతి, సంఘాల పనితీరు, రుణాల సద్వినియోగంపై జిల్లా మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశం
- స్పెషల్ ఆఫీసర్లుగా ఎంపికైన అధికారులకు దిశానిర్దేశం
- కోటక్ మహీంద్ర బ్యాంక్ నూతన బ్రాంచ్ ప్రారంభం

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 31 : చదువు అనే ఆయుధాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి విద్యార్థులకు హితవు పలికారు. బుధవారం వికారాబాద్‌లోని అంబేద్కర్ భవన్‌లో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి వసతి గృహ విద్యార్థినీ విద్యార్థులకు ప్రేరణ, శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. వారికి వివిధ పాఠ్యాంశాలపై తర్ఫీదు , మనోధైర్యం, వ్యక్తిగత నైపుణ్యాన్ని పెంచేందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయులు, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్లచే తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థినీ విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న క్రమంలో భయం, ఉత్సాహం ఉంటుందని, తమ లక్ష్యాన్ని సాధించే దిశగా చదువుపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఏవైనప్పటికీ చదువుకోవాలి అనే కోరిక గట్టిగా ఉంటే ఏదైనా సాధ్యమేనన్నారు. విద్యార్థుల్లో లక్ష్యం గొప్పదిగా ఉండాలని, చదువుల్లో డిగ్రీలు ముఖ్యం కాదని నైపుణ్యంతో కూడిన విద్యను నేర్చుకోవాలన్నారు. విద్యార్థులు దొడ్డిదారిలో పరీక్షలు రాసి ఉత్తీర్ణులైతే భవిష్యత్తులో ఎంతో ఇబ్బంది పడాల్సి వస్తుందని కలెక్టర్ వివరించారు. వసతి గృహాల్లో చదువుకున్న విద్యార్థులందరూ పేదరికం నుంచి వచ్చిన వారేనని, చదువుతో మీ భవిష్యత్తును మార్చుకొని మీ వంశ వృక్షంలో ఒక మలుపు దిశగా అడుగులు వేస్తూ ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యను అభ్యసించేందుకు వచ్చే విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో సదుపాయాలు కల్పించిందన్నారు. పరీక్షల సమయంలో ప్రత్యేక తరగతులు నిర్వహించి స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్లు సలహాలు, సూచనలను తీసుకొని పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉత్తీర్ణులు కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ అమిత్ నారాయణ, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి మల్లేశం, ఎస్సీ, బీసీ, సంక్షేమ అధికారులు ఉమాపతి, వీరానందం, భీమ్‌రాజ్, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్లు రామచంద్రుడు, మాధవి, మహేందర్, శ్రీధర్, పీ.వీ రెడ్డి, వివిధ వసతి గృహాల వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మానవ వనరులను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. వికారాబాద్‌లోని బ్లాక్ గ్రౌండ్ సమీపంలోని స్త్రీ శక్తి భవన్‌లో జిల్లాలో మహిళా సంఘాల ఆర్థిక పురోగతి, సంఘాల పనితీరు, రుణాల సద్వినియోగంపై జిల్లా మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల మహిళలు వారి ఆర్థిక ఎదుగుదలతో పాటు సామాజిక సమస్యలపై కూడా దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో మహిళలు, వితంతువుల సమస్యలు, బాల్య వివాహాలను అరికట్టేందుకు.. ఆడ మగ తేడా లేకుండా వివిధ సమస్యలపై స్పందించి పనిచేయాలని సూచించారు. జిల్లాలో అతివేగంగా అభివృద్ధి దశలో పయనించే క్రమంలో వైద్య కళాశాలతో పాటు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్‌మెంట్) యూనివర్సిటీ జిల్లాలో ఏర్పాటు చేయబోతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ముఖ్య ప్రాధాన్యతలో భాగంగా మహిళలు పలు రంగాల్లో శిక్షణ పొందే దిశగా విద్యార్హతల జాబితాలను రూపొందించాలని డీఆర్డీవో కృష్ణన్‌కు కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు డీఆర్డీవో నర్సింహులు, డీపీఎంలు రాంనాథ్, నర్సింహులు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు అలివేలు, కార్యదర్శి లక్ష్మి ఉన్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా సర్కారు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి గూగుల్ మీట్ ద్వారా కొత్తగా స్పెషల్ ఆఫీసర్లుగా ఎంపికైనవారితో కలెక్టర్ సమావేశం నిర్వహించి వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్పెషల్ ఆఫీసర్లుగా నియామక ఉత్తర్వులు రేపటి వరకు అందించనున్నామని, ఉత్తర్వులు అందిన వెంటనే గ్రామపంచాయతీకి సంబంధించిన రికార్డులు, లాగిన్లతో సహా పూర్తి చార్జిని తీసుకోవాలని సూచించారు. స్పెషల్ ఆఫీసర్లు గ్రామపంచాయతీల్లో ఇంతకుముందు పాలకవర్గం చేపట్టిన పనులన్నీ సక్రమంగా నిర్వహించాలన్నారు. తీసుకునే ప్రతి నిర్ణయం ప్రజలకుపయోగపడేలా పూర్తి బాధ్యతతో పనిచేయాలని, ప్రభుత్వ ఆస్తులు, నిధులు దుర్వినియోగం చేయకుండా పనులను చేపట్టాలన్నారు. ప్రతిరోజూ నిర్వహించే పారిశుధ్య పనులు, తాగునీరు, విద్యుత్ సరఫరా తదితర పనుల్లో ఆటంకం లేకుండా చేపట్టాలన్నారు. స్పెషల్ ఆఫీసర్లు నిర్వహించాల్సిన పనులు 25 శాతముంటే, కింది స్థాయి సిబ్బందితో 75 శాతం పనులు చేయించాలన్నారు. ఎంపీడీవోలు, ఎంపీవోల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

మంచి సేవలు అందించాలి

రైతులకు మంచి సేవలు అందించేందుకు కృషి చేయాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి కోటక్ మహీంద్ర బ్యాంక్ అధికారులకు సూచించారు. బుధవారం వికారాబాద్‌లో కోటక్ మహీంద్ర బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బ్యాంకు అధికారులతో మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా వ్యవసాయ ఆధారిత ప్రాంతమని, ఇక్కడి రైతులను ప్రోత్సహించేలా బ్యాంకర్ల సేవలు ఉండాలన్నారు. జిల్లాలో చిన్నచిన్న పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహికులను ప్రోత్సహించేలా బ్యాంకు పని చేయాలని కలెక్టర్ కోరారు. ప్రారంభోత్సవంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రాంబాబు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్, రీజినల్ బిజినెస్ హెడ్ నటరాజ్ డోకే, క్లస్టర్ ఏరియా మేనేజర్ అనిల్, జనరల్ మేనేజర్ రాఘవేంద్రగౌడ్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు

కేతిరెడ్డిపల్లిలో ప్రభుత్వ పాఠశాల ప్రహరీని ప్రారంభిస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

గ్రామాలను అభివృద్ధి చేయడంలో సర్పంచ్‌లది కీలక పాత్ర

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

మొయినాబాద్, జనవరి 31 : గ్రామాలను అభివృద్ధిపర్చడంలో సర్పంచ్‌లు కీలక భూమిక పోషించారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లిలో జిల్లా పరిషత్ నిధులు రూ.22 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, ప్రభుత్వ పాఠశాల ప్రహరీ నిర్మాణం పనులు పూర్తి కావడంతో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జడ్పీ ద్వారా అన్ని గ్రామాలకు సముచిత స్థానం కల్పించి నిధులు కేటాయించినట్లు చెప్పారు. గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్‌లు కోరడంతో జడ్పీ నిధుల ప్రకారం గ్రామాలకు నిధులను కేటాయించినట్లు తెలిపారు. గ్రామంలో పల్లె ప్రగతి కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారని తెలిపారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి విడుదల కావడానికి కొద్దిగా ఆలస్యం జరిగినా సర్పంచ్‌లు సొంత డబ్బులు పెట్టి పనులు పూర్తి చేసిన తరువాత ప్రభుత్వం విడుదల చేసినప్పుడు డబ్బులు తీసుకున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు చేయడంతో పాటు పచ్చదనం, పరిశుభ్రత పట్ల ఎంతో శ్రద్ధ తీసుకున్నారని చెప్పారు. గ్రామంలో పచ్చదనాన్ని అభివృద్ధి చేయడానికి సర్పంచ్‌లు ఎంతో కృషి చేశారని తెలిపారు. గ్రామాల ప్రగతి విషయంలో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమన్వయంతో గ్రామాలను ప్రగతి పథంలో నడిపించారన్నారు. బీఆర్ఎస్ పాలనలో పల్లెల ప్రగతి కోసం అనేక కార్యక్రమాలను తీసుకొచ్చి పకడ్బందీగా అమలు చేసిందని, దానికి సర్పంచ్‌లు కృషి చేసినందుకు సర్పంచ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీకాంత్, సర్పంచ్ శోభ, ఉపసర్పంచ్ సిద్ధయ్య, పంచాయతీ కార్యదర్శి తారాబాయి, ఏఎంసీ వైస్ చైర్మన్ రవూఫ్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు జయవంత్, యువజన విభాగం మండల అధ్యక్షుడు పరమేశ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ముజ్జు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

మైనర్లు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులదే పూర్తి బాధ్యత
తల్లిదండ్రులపైనా కేసులు నమోదు చేస్తాం
వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి
వికారాబాద్‌లో 35వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు
ఎన్టీఆర్ చౌరస్తాలో రోడ్డు భద్రతా అవగాహన ర్యాలీ

రోడ్డు భద్రతా అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, జనవరి 31 : రోడ్డు ప్రమాదాలను తగ్గించడం సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరి బాధ్యత అని వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. బుధవారం 35వ జాతీయ రహదారి భద్రతా ఉత్సవాల సందర్భంగా వికారాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో రోడ్డు సేఫ్టీ అవేర్నెస్ ర్యాలీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ, ఆర్టీసీ, పోలీస్ అధికారులు, వికారాబాద్‌లోని కళాశాల, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీ ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ఎమ్మార్పీ పెట్రోల్ పంప్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సుమారు గంటకు 400 వరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ బాధ్యత వహిస్తూ తమ పిల్లలకు, చుట్టుపక్కల వారికి రోడ్డు నిబంధనలు తదితర విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా స్కూల్, కాలేజీలలో ఉపాధ్యాయులు పిల్లలకు రోడ్డు ప్రమాదాలు, రోడ్డు రవాణా, మైనర్ డ్రైవింగ్ తదితర విషయాలపై అవగాహన పెంచాలని ఎస్పీ సూచించారు.

అందరూ బాధ్యతగా తీసుకున్నప్పుడే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. రోడ్డు ప్రమాదాల ద్వారా సంభవించే మరణాల్లో ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాల ప్రమాదాలే కారణమవుతున్నాయిని పేర్కొన్నారు. దానికి హెల్మెట్లు ధరించకపోవడమే ప్రధాన కారణమని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని వివరించారు. పరిమితికి మించి ప్రయాణికులు ఉన్నప్పుడు ప్రమాదాలు జరిగితే తీవ్రమైన ప్రాణనష్టం జరుగుతుందన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దని, ట్రిపుల్ రైడింగ్‌లు చేయవద్దని కోరారు. మనమందరం రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ ప్రమాదాలను తగ్గించడంలో మన వంతు కృషి చేయాలని ఎస్పీ వివరించారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు, సిబ్బందితో రోడ్డు నిబంధనలు పాటించేలా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఆర్టీఏ అధికారి జోసెఫ్, ఆర్టీసీ డిపో మేనేజర్ భక్షీనాయక్, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు, సిబ్బంది

ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న అమిత్‌మిశ్రా

భూగర్భ జలాల అభివృద్ధికి ఇంకుడు గుంతలు తప్పనిసరి

జల్‌శక్తి అభియాన్ డిప్యూటీ సెక్రెటరీ అమిత్‌మిశ్రా

మంచాల, జనవరి 31 : భూగర్భ జలాలు అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బోరు బావుల పక్కన ఇంకుడు గుంతలను తీసుకోవాలని జల్‌శక్తి అభియాన్ డిప్యూటీ సెక్రెటరీ అమిత్‌మిశ్రా అన్నారు. బుధవారం మంచాల మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన వర్షాధార నీటి నిల్వ ఇంకుడు గుంతలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి నిల్వలను పెంపొందించుకోవాలంటే ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఇంకుడు గుంతలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపడితే పెద్దమొత్తంలో భూగర్భ జలాలు పెరుగుతాయని ఆయన చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త అంకిత, విశ్వకర్మ జిల్లా గ్రామీణ అభివృద్ధి అదనపు అధికారి నీరజ, ఇబ్రహీంపట్నం క్లస్టర్ అధికారి సక్రియానాయక్, ఏపీవో వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామపంచాయతీ క్లస్టర్‌గా కడ్తాల్

- ప్రాజెక్ట్ టీం లీడర్ దిలీప్‌కుమార్‌పాల్
- గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించిన వివిధ రాష్ట్రాలకు చెందిన యువతీ యువకులు

కడ్తాల్‌లోని రైతు వేదికను సందర్శించిన పలు రాష్ట్రాలకు చెందిన యువత

కడ్తాల్, జనవరి 31 : గ్రామపంచాయతీల అభివృద్ధిలో ఇతర గ్రామాల కంటే కడ్తాల్ గ్రామపంచాయతీ ఆదర్శంగా నిలిచిందని, గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులు భేషుగ్గా ఉన్నాయని మోడల్ జీపీ క్లస్టర్ ప్రాజెక్ట్ టీం లీడర్ దిలీప్‌కుమార్‌పాల్ అన్నారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్డీపీఆర్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆదర్శ గ్రామపంచాయతీల ఏర్పాటులో భాగంగా మణిపూర్, నాగాలాండ్, ఒడిశా, పంజాబ్, జమ్ముకశ్మీర్, మహారాష్ట్రతోపాటు పలు రాష్ట్రాలకు చెందిన 50 మంది యువతీ యువకులు బుధవారం దిలీప్‌కుమార్‌పాల్ నేతృత్వంలో కడ్తాల్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్‌పాల్ మాట్లాడుతూ.. కడ్తాల్ గ్రామం ఆదర్శ గ్రామపంచాయతీగా నిలిచిందని తెలిపారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు అద్భుతంగా ఉన్నాయని ఆయన కితాబిచ్చారు.

అనంతరం గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను వారు సర్పంచ్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీలో సొంత ఆదాయ మార్గాల వివరాలు, గ్రామాభివృద్ధికి చేసే ఖర్చులను ఆయన వివరించారు. గ్రామంలో మంచినీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణను వారికి వివరించారు. పల్లె ప్రకృతివనం, తెలంగాణ హరితహారం, ప్రజాపాలన కార్యక్రమ వివరాలను తెలియజేశారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధుల గురించి వారికి సర్పంచ్ వివరించారు. అనంతరం గ్రామంలో నిర్మించిన రైతు వేదిక, వైకుంఠధామం, పల్లె ప్రకృతివనం, స్వయం సహాయక సంఘం, పారిశుధ్య నిర్వహణ తీరును వారు పరిశీలించారు. కార్యక్రమంలో పలు రాష్ట్రాల యువకులు రతన్‌రాజ్, బుద్ధచంద్రసింగ్, నారాయణ మాలిక్, శ్రీతంకల్ప, కుమార్‌శుభం, ఉపేందర్, కన్నయ్య, వార్డు సభ్యులు గణేశ్‌గౌడ్, రామచంద్రయ్య, నాయకులు లాయక్‌అలీ, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పరిగూడ సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులపై అవిశ్వాసం

జిల్లా కోఆపరేటివ్ అధికారికి తీర్మాన పత్రాన్ని అందజేసిన 11 మంది డైరెక్టర్లు


జిల్లా కోఆపరేటివ్ అధికారికి అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న డైరెక్టర్లు

ఇబ్రహీంపట్నం, జనవరి 31 : రంగారెడ్డిజిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఉప్పరిగూడ సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులపై డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈమేరకు 11 మంది డైరెక్టర్లు బుధవారం జిల్లా కోఆపరేటివ్ అధికారికి సంతకాలతో కూడిన తీర్మాన పత్రాన్ని అందజేశారు. ఉప్పరిగూడ సహకార సంఘంలో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉన్నారు. వీరిలో చైర్మన్, వైస్ చైర్మన్ మినహా మిగతావారందరు అవిశ్వాస తీర్మానంలో పాల్గొన్నారు. చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్ శంకర్‌లపై కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు చెందిన డైరెక్టర్లు పాండురంగారెడ్డి, పుల్లయ్య, జంగారెడ్డి, విశాల, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పోచమ్మ, జంగయ్య, సీతయ్య, అశోక్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులున్నారు. జిల్లాలోనే అత్యధికంగా డిపాజిట్లు, ఆదాయ వనరులు అధికంగా ఉన్న ఈ సహకార సంఘాన్ని ఎలాగైనా కాంగ్రెస్ పార్టీ తమ ఖాతాలో వేసుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నది. అందులో భాగంగానే మెజార్టీ డైరెక్టర్లందరూ చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసం పెట్టడానికి ముందుకొచ్చారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఏడీ కృష్ణయ్య

కందుకూరు పశువైద్యశాల తనిఖీ

కందుకూరు, జనవరి 31 : కందుకూరు ప్రాథమిక పశువైద్య కేంద్రాన్ని రంగారెడ్డి జిల్లా పశుసంవర్ధశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) డాక్టర్ కృష్ణయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం ఆయన దవాఖానకు చేరుకొని రికార్డులను పరిశీలించిన అనంతరం డాక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు సమయానికి వస్తున్నారా లేదా అని రైతులను అడిగారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు రేవతి, షాహిన్‌షేక్, సంధ్యరాణి, సిబ్బంది ఉన్నారు.

మహిళలకు ఉచితంగా స్వయం ఉపాధి శిక్షణ

మొయినాబాద్, జనవరి 31 : గ్రామీణ నిరుద్యోగ మహిళలకు ఉచితంగా స్వయం ఉపాధి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం జిల్లా అధికారి శైలజాకుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని చిలుకూరు గ్రామంలో ఉన్న దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం)లో బ్యూటీషియన్, కుట్టు శిక్షణ(టైలరింగ్)లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు ఉచిత భోజన సౌకర్యం, వసతి కల్పించడం జరుగుతుంది. దరఖాస్తుదారులు 14 నుంచి 18 ఏండ్ల మధ్య ఉండాలని సూచించారు. ఆసక్తిగలవారు రెండు పాస్‌పోర్ట్ ఫొటోలు, రేషన్డ్, ఆధార్ కార్డు జిరాక్స్‌లు దరఖాస్తుకు జతపర్చి ఇవ్వాలని సూచించారు. నేటి నుంచి శిక్షణ ప్రారంభించనున్నామని తెలిపారు. వివరాలకు 7660022524కు ఉదయం 10.30 నుంచి సా. 5 గంటల మధ్యలో సంప్రదించాలన్నారు.

10 మంది ఉద్యోగులకు సన్మానం

సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : పలు హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పలువురు జీహెచ్ఎంసీ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. బుధవారం సాయంత్రం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం పన్వర్ హాల్‌లో అడిషనల్ కమిషనర్ సరోజ, లేబర్ సెక్షన్ పర్సనల్ ఆఫీసర్ విజయ భాస్కర్‌రెడ్డి, జాయింట్ కమిషనర్ జయంత్ 10 మంది సిబ్బందిని సన్మానించారు. చార్మినార్ సర్కిల్‌లో కామాటిగా పనిచేసిన సీహెచ్ కృష్ణ, శంకర్, సోమయ్య, ప్రధాన కార్యాలయంలో పనిచేసిన బలరాం, ఖైరతాబాద్ సర్కిల్‌లో శానిటరీ జవాన్ మురళీకృష్ణ, జైకుమార్, వెంకటమ్మ, స్వీపర్ బాల్‌రాజ్, లక్ష్మి ఉన్నారు.

మెట్రో మార్నింగ్ ఆఫర్

కేబీఆర్‌లో వాకింగ్‌కు వెళ్లేవారికి 10 శాతం రాయితీ

సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ): కేబీఆర్ పార్కులో వాకింగ్ వెళ్లేవారికి ఎల్అండ్‌టీ మెట్రో ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 8 నుంచి 11.59 గంటల మధ్య మెట్రో ప్రయాణికులకు నెబులా స్మార్ట్ కార్డ్‌పై 10 శాతం రాయితీని ఇస్తున్నట్లు ప్రకటించింది. నగరంలో ఎక్కడి నుంచి మెట్రో బయలుదేరి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద దిగేవారికి సూపర్ పీక్ అవర్స్‌లో ఈ రాయితీని ఇస్తున్నట్లు మెట్రో అధికారులు తెలిపారు. ఉదయం, రాత్రి వేళల్లో వాకింగ్ చేసే వారికి ఈ ఆఫర్‌ను వర్తింపజేస్తున్నారు.

ఫెడెక్స్ కొరియర్‌లో డ్రగ్స్ అంటూ మోసాలు

ముఠాతో సంబంధమున్న సైబర్ చీటర్ అరెస్ట్

సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ): ఫెడెక్స్ పార్శిల్‌లో అక్రమంగా నిషేధిత పదార్థాలైన డ్రగ్స్, విదేశీ కరెన్సీని రవాణా చేస్తూ మోసాలకు పాల్పడుతున్న ముఠాకు చెందిన ఒక సైబర్ నేరగాడిని సీసీఎస్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. జాయింట్ సీపీ ఏవీ రంగనాథ్ కథనం ప్రకారం.. కొరియర్‌లో డ్రగ్స్, ఇతర నిషేధిత పదార్థాలు సరఫరా చేస్తున్నారు.. మేం కస్టమ్స్ అధికారులం, మీపై కేసు నమోదైంది, సీబీఐ, ఆర్‌బీఐ అధికారులతో మాట్లాడాలంటూ బెదిరిస్తూ సైబర్ నేరగాళ్లు చాల మంది నుంచి లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ ముఠాతో చేయి కలిపిన జావేద్ నవాబ్ యాకూబ్‌ఖాన్ బ్యాంకు ఖాతాలు సరఫరా చేస్తున్నాడు. ఆయా ఖాతాల్లో డిపాజిట్ అయిన మొత్తంలో 10 శాతం అయూబ్‌ఖాన్ కమీషన్‌గా తీసుకునేవాడు. కవాడిగూడకు చెందిన ఓ బాధితుడిని ఇలాగే బెదిరించి రూ. 8,74,998 కాజేశారు. సీసీఎస్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని ఇన్‌స్పెక్టర్ నరేశ్ నేతృత్వంలో ఎస్సై శైలేంద్ర తదితరుల బృందం దర్యాప్తు జరిపింది. ఆ ఖాతా జావేద్ నవాబ్ యాకూబ్‌ఖాన్‌దిగా గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ ఖాతాలో దేశవ్యాప్తంగా రూ.2.85 కోట్ల లావాదేవాలు జరిగినట్లు గుర్తించి ఖాతాను ఫ్రీజ్ చేసి అరెస్ట్ చేశారు.

తరచూ చెత్త వేసే ప్రాంతాలపై దృష్టి పెట్టండి

- వినియోగంలోకి రాని పబ్లిక్ టాయిలెట్లను తొలగించండి
- క్షేత్రస్థాయి పర్యటనలో జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో దశల వారీగా చెత్త వల్నరబుల్ పాయింట్ల (తరచూ చెత్త వేసే ప్రాంతాల)ను తొలగించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని యూసుఫ్‌గూడ, శేరిలింగంపల్లి, చందానగర్, రామచంద్రాపూర్, పటాన్‌చెరువు సర్కిళ్లలో పారిశుధ్య పనులపై కమిషనర్ బుధవారం అధికారులతో కలిసి సమీక్షించారు. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను సమీప సెకండరీ ట్రాన్స్‌ఫర్ పాయింట్‌లకు తరలించడం, ప్రతి సర్కిల్‌లో తిరుగుతున్న వాహనాల సంఖ్య, సీ అండ్ డీ మెటీరియల్ లిఫ్ట్, ఎస్ఎఫ్ఏ సంఖ్య తదితర వివరాలను కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. గేటెడ్ కమ్యూనిటీలలో చెత్తను సేకరించేందుకు వీలుగా డస్ట్ బిన్ ఏర్పాటు చేయాలని, వినియోగంలో లేని పబ్లిక్ టాయిలెట్లను తొలగించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు జీహెచ్ఎంసీ కమిషనర్ దుర్గం, చుట్టుపక్కల ఉన్న సరిహద్దు గోడ, నడక మార్గం మొదలైన ఇంజినీరింగ్, పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ స్నేహ, శానిటేషన్ విభాగం అదనపు కమిషనర్ ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి సూచనలిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

హామీలను నెరవేర్చకుంటే ప్రజలే నిలదీస్తారు

- కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నది
- మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారు
- మాజీ మంత్రి సబితారెడ్డి

కందుకూరు. జనవరి 31 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిసెంబర్ 9న రైతుల ఖాతాల్లో రైతు బంధు డబ్బులు వేస్తామని చెప్పి ఇంకా వేయలేదని.. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఆ పార్టీ విఫలమైందని మాజీ మంత్రి సబితారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గూడూరు, మాదాపూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 50 రోజుల్లోనే బీఆర్ఎస్ శ్రేణులపై భౌతిక దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు తనపై నమ్మకం ఉంచి గెలిపించారని.. వారి ఆశలను వమ్ముచేయకుండా కష్టపడి పనిచేస్తానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతి ద్వారా నిధులను ఇచ్చి విధులు నిర్వహించేలా నాటి సీఎం కేసీఆర్ చొరవ తీసుకున్నారని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి బాటలు వేసినట్లు తెలిపారు. అనంతరం ఆమె అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం నాటి ప్రభుత్వం కృషి చేసిందన్నారు. మన ఊరు మన బడి ప్రవేశపెట్టి ఆంగ్లమాధ్యమం ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. సర్పంచ్‌లు శ్రీలత, సాయి ధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎంపీపీ జ్యోతి, జడ్పీటీసీ జంగారెడ్డి, వైఎస్ ఎంపీపీ శమంత, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్, సీనియర్ నాయకుడు దశరథ, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ విజేందర్‌రెడ్డి, డైరెక్టర్లు, యూత్ నాయకులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గూడూరులో విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి